# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 08 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4




వివరాలు 2వ పేజీలో

## ముఖ్యమంత్రికి జన్మదిన కానుక

పట్టు వస్త్రంపై రేవంత్‌రెడ్డి ముఖచిత్రంను నేచిన సిరిసిల్ల నేతన్న

# ఫార్ములా-ఈ రేస్ వల్ల లాభమే జరిగింది

## చివరి నిమిషంలో రేస్ రద్దుతో రాష్ట్రానికి రూ. 800 కోట్ల నష్టం




- దాని ఉపయోగం తెలియక రేవంత్‌రెడ్డి రద్దు చేశారు
- అరెస్టు చేస్తే జైలులో యోగా చేసొస్తా.. తర్వాత పాదయాత్ర చేస్తా
- మేఘా కృష్ణారెడ్డి ఇంటిపైకి సీబీఐని పంపే దమ్ము రేవంత్‌రెడ్డికుందా?

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఫార్ములా -ఈ రేస్ వల్ల జరిగే లాభం సీఎం రేవంత్ రెడ్డికి తెలియదు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తమ హయాంలో నిర్వహించిన ఫార్ములా -ఈ రేస్ వల్ల లాభమే జరిగిందని.. అయితే చివరి నిమిషంలో ఫార్ములా-ఈ రేస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో రాష్ట్రానికి రూ. 800 కోట్ల నష్టం వచ్చిందని కేటీఆర్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రానికి రూ. లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చినందుకు తనపై కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. భారత్‌లో ఫార్ములా 1 రేసింగ్ నిర్వహించాలని 2003లోనే చంద్రబాబు ఆశించారని, కానీ, నిర్వాహకులు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో సాధ్యం కాలేదని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మళ్లీ తాను వాళ్లతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయిందన్నారు. అందుకే ఎలక్ట్రిక్ వాహనాలతో నిర్వహించే ఫార్ములా ఈ కారు రేసింగ్ నిర్వహించామని కేటీఆర్ తెలిపారు.2023 ఫిబ్రవరిలో ఫార్ములా-2 రేస్ నిర్వహించాం. నాలుగేండ్ల పాటు ఒప్పందం కుదిరింది. హోస్ట్ సిటీగా హైదరాబాద్(హెచ్ఎండీఏ), ప్రయివేటు స్పాన్సర్‌గా గ్రీన్ కోకు సంబంధించిన ఏస్ అర్బన్ అనే కంపెనీ, ఎఫ్ఐఏ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ప్రమోటర్ ఏమన్నారంటే ప్రభుత్వానికి లాభం వచ్చింది కానీ నాకు ప్రచారం రాలేదన్నాడు. వచ్చే ఏడాది స్పాన్సర్ చేయను అని చెప్పి వెనక్కి వెళ్లాడు. ఒప్పందం నుంచి తప్పుకుంటున్నట్టు సమాచారం ఇచ్చారు. దీంతో ఎఫ్ఐఏ వాళ్లు ఏం చేశారంటే మాకు సమాచారం ఇచ్చారు హైదరాబాద్‌లో నిర్వహించట్లేదని. గ్రీన్ కో కంపెనీ పైసలు రాలేదని తప్పుకుంది. ఈ విషయంపై నన్ను జూన్, జులైలో సెక్రటరీ అరవింద్ కుమార్ అడిగారు. గ్రీన్ కో కాకపోతే మరొక స్పాన్సర్‌ను పట్టుకుందామని చెప్పితే వారికి కమిట్‌మెంట్ ఇచ్చారు. చివరకు వాళ్లు ప్రకటించిన క్యాలెండర్‌లో మన హైదరాబాద్ పేరు లేదు. ఆ తర్వాత వాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడాను. తప్పకుండా మా ప్రభుత్వం వస్తది.. ఆరు నెలల తర్వాత. నేను ప్రయివేటు ప్రమోటర్లను పట్టుకుని.. ఏర్పాట్లు చేస్తాం. తాత్కాలికంగా పైసలు ఇస్తామని మాటిచ్చాను. గవర్నమెంట్ నుంచి కడుదాం.. మళ్లీ తీసేసుకుందాం అని అరవింద్ కుమార్‌కు చెప్పానని కేటీఆర్ గుర్తు చేశారు. హెచ్ఎండీఏ 2024 నవంబర్ 14న జీవో ఇచ్చింది. రేస్‌కు సంబంధించి హెచ్ఎండీఏకు సంపూర్ణ అవగాహన ఉంది. కామన్వెల్త్‌కు 70 వేల కోట్లు పెట్టారో.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు, ఈవీల్లో టాప్ చాంపియన్ చేసేందుకు ఈ రేస్ నిర్వహణకు హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు కట్టాం. ఇందులో అరవింద్ కుమార్ తప్పు లేదు. మంత్రిగా నేనే సంతకం పెట్టి నిర్ణయం తీసుకున్నా. కేబినెట్ నిర్ణయం లేదు కదా అని అంటున్నారు. హెచ్ఎండీఏ, హెచ్ఎండబ్ల్యూఎస్, జీహెచ్ఎంసీ మూడు విభాగాలు ఇంటర్నల్‌గా డబ్బులను అడ్జస్ట్ చేసుకుంటాయి. ఇది రెగ్యులర్‌గా జరిగే పని. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా అదే పని చేస్తది. హెచ్ఎండీఏ ఇండిపెండెంట్ బోర్డు. చైర్మన్ సీఎం, వైస్ చైర్మన్ మున్సిపాలిటీ మంత్రి. నా ఆదేశాల మేరకు సెక్రటరీ డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేశారని తెలిపారు.

జైలుకెళ్లేందుకైనా తాను సిద్ధమని అన్నారు. జైల్లో పెడితే యోగా చేసి.. పాదయాత్రకు సిద్ధపడతానని చెప్పారు. రాజ్‌భవన్‌లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతున్నాయని, ఆ రెండు పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ను ఖతం చేసేందుకు యత్నిస్తున్నాయని ఆరోపించారు.తనను విచారించేందుకు అనుమతివ్వడం గవర్నర్ విచక్షణపై ఆధారపడి ఉంటుందన్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడితే ఎదుర్కుంటానని అన్నారు.

కామన్వెల్త్ గేమ్స్ అనగానే కాంగ్రెస్ చేసిన కుంభకోణాలు గుర్తుకువస్తాయని కేటీఆర్ విమర్శించారు. ఈ కామన్వెల్త్ కుంభకోణంలో సురేశ్ కల్మాడి జైలుకు కూడా వెళ్లాడని కేటీఆర్ గుర్తు చేశారు. ఓ మంచి ఉద్దేశంతో హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహిస్తే.. దానిపై ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. రేసు రద్దు చేసినందుకు రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖలపై కేసు పెట్టాలన్నారు. తాము హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేస్తే.. రేవంత్ రెడ్డి బ్యాడ్ ఇమేజ్ తెస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి చేసిన తప్పు వల్ల 800 కోట్ల నష్టం వచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. " రూటు మార్చి ఆటో ఎక్కిన కేటీఆర్... ఎందుకంటే!" మేఘా కృష్ణారెడ్డి ఇంటికి ఏసీబీని పంపే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా? అని కేటీఆర్ సవాల్ విసిరారు. సుంకిశాల ఘటనలో అవినీతి కేసు పెట్టాల్సి వస్తే కృష్ణారెడ్డిపై పెట్టాలన్నారు. రూ. 80 కోట్లు నష్టం జరిగిందని అధికారులు నివేదిక ఇచ్చారని

మిగితా2వ పేజీలో

# నేడు సీఎం రేవంత్ పాదయాత్ర



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు పాదయాత్ర చేపట్టనున్నారు. . "మూసీ పునరుజ్జీవ ప్రజా చైతన్య యాత్ర" పేరుతో పాదయాత్ర ప్రారంభించనున్నారు. ఈ మేరకు పలు కార్యక్రమాల షెడ్యూల్ విడుదలైంది. షెడ్యూల్‌తో పాటు పాదయాత్ర రూట్ మ్యాప్ గురించి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు.

రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా హెలికాప్టర్ లో ఉదయం 8:45 గంటలకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చేరుకుంటారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామివారి దర్శనానంతరం ఉదయం 10 గంటలకు వీటీడీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అనంతరం.. మధ్యాహ్నం ఒంటి గంటకు వలిగొండ మండలం సంగెం గ్రామానికి సీఎం రేవంత్ రెడ్డి చేరుకుంటారు. "మూసీ పునరుజ్జీవ ప్రజా చైతన్య యాత్ర" పేరుతో పాదయాత్ర ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు వలిగొండ మండలం సంగెం గ్రామానికి సీఎం రేవంత్‌రెడ్డి చేరుకుని మూసీ పునరుజ్జీవ ప్రజా చైతన్య యాత్ర పేరుతో పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ యాత్రలో భాగంగా.. మూసీ నది వెంబడి పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ.. వారి బాధలు తెలుసుకుంటూ.. మూసీకి పునరుజ్జీవంపై భరోసా కల్పించనున్నారు. ఈ క్రమంలో భీమ లింగం, ధర్మారెడ్డి కాల్వలను కూడా రేవంత్ రెడ్డి సందర్శించనున్నారు. అనంతరం మూసీ పరివాహక ప్రాంత రైతులతో రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. రైతులను ఉద్దేశించి మాట్లాడతారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

# త్వరలో ఆటమ్ బాంబ్ పేలబోతోంది

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



త్వరలో ఆటమ్ బాంబు పేలబోతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వర్దన్నపేటలో గురువారం జరిగిన ఓ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ "గుమ్మడికాయ దొంగ ఎవరు అంటే భుజాలు తరుముకుంటున్నారు. రాజకీయ బాంబు పేలబోతుందని నేను చేసిన వ్యాఖ్యలను చూసి నవ్వారు. పేలబోయేది నాటు బాంబ్ కాదు.. లక్ష్మీ బాంబ్ కాదు ఆటమ్ బాంబు పేలబోతుంది' అని తెలిపారు. ఎవరు అనేది తాను కానీ, ముఖ్యమంత్రి కానీ పేర్లు చెప్పలేదని వివరించారు. 'తప్పుచేసిన వారిని చట్టం వదిలి పెట్టదు. తప్పు చేయకపోతే మీకు అంత ఉలిక్కిపాటు ఎందుకు?' అని పొంగులేటి ప్రశ్నించారు. 'మీ ఆస్తులు పెంచుకోవడం కోసం పేదల సొమ్ము విదేశాలకు పంచిన వారిని చట్టం వదలదు. చట్టం తన పని తాను చేసుకుంటది' అని తెలిపారు. 'రూ.55 కోట్ల పేదల సొమ్ము ఇక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాయో త్వరలోనే బయట పడతాయి. అవి ఎవరు తీసుకున్నారో బయట పెడతాం' అని ప్రకటించారు.

అలాగే తొర్రూర్ వ్యవసాయ నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారసభలో ఆయన మాట్లాడారు. "కేటీఆర్.. నువ్వు చేసిన తప్పేంటో నీకు తెలుసు... నీకు పడబోయే శిక్ష ఏంటో నీకు తెలుసు" అని అన్నారు. 11 నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటడుతున్నాయని చెప్పారు. తల తాకట్టు పెట్టైన డిసెంబర్ లోపు 13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని అన్నారు. రుణమాఫీ అయ్యాక నీ తల ఏ టైరు కింద పెడతావో ఆలోచించుకో అంటూ కేటీఆర్‌పై మండిపడ్డారు. తాను బీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌ను తండ్రిలా భావించి కాళ్లు మొక్కానని మంత్రి పొంగులేటి చెప్పారు. కానీ, తడిగుడ్డతో గొంతుకోశారని అన్నారు. తనకు నాలుగు గోడల మధ్య కాళు పట్టుకునే అవసరం లేదన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు.. పొంగులేటి హోంమంత్రా? అలా ఎందుకు మాట్లాడుతున్నారని అంటున్నారని.. తాను కేబినెట్ మంత్రినని.. అన్ని విషయాలపై మాట్లాడతానని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తున్నానని అంటున్నారని.. పాదయాత్ర చేస్తారో.. మోకాళ్ల యాత్ర చేస్తాడో నిర్ణయం ఆయనే తీసుకోవాలని ఎద్దేవా చేశారు. తాను ఆ పార్టీ, ఈ పార్టీ నేతలను అరెస్ట్ చేస్తారని ఎక్కడా చెప్పలేదని మంత్రి తెలిపారు. దానికి శ్రీనివాస్ రెడ్డి అదాని కాళ్లు మొక్కాడని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనకు చట్టం తెలుసునని, ఎప్పుడు, ఎక్కడ ఏం జరగాలో అది జరుగుతుందన్నారు.

మరోవైపు వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తప్పు చేసిన వాళ్లకు నాటు బాంబు కాదు.. లక్ష్మీబాంబు కాదు.. ఆటమ్ బాంబు పేలబోతోందని అన్నారు. జనం సొమ్మును అక్రమమార్గంలో విదేశాలకు పంపారని, ఎంత పెద్ద వాళ్లకైనా చట్టం చుట్టం కాదన్నారు. రూ. 55 కోట్లు ఎక్కడ్నుంచి ఎక్కడికి వెళ్లాయో తేలుస్తామన్నారు. తప్పు చేయనివాళ్లు ఉలిక్కిపడాల్సిన అవసరం లేదన్నారు.

# కుటుంబ సర్వేను స్వయంగా సీఎం పర్యవేక్షిస్తున్నారు

- పకడ్బందీగా సర్వే నిర్వహించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
- ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్త శుద్ధితో కృషిచేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఈ ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై గురువారం ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, ఇతర అధికారులు పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ఈ సర్వేకు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే ప్రక్రియ రేపటితో పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందని అన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలోనే ప్రథమంగా చేపట్టిన ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటు-ంబం పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను చైతన్య పర్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటినికూడా వదలకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అన్నారు.

# 9 మంది డీఎస్పీల బదిలీ..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో తొమ్మిదిమంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ.మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా, కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. వనపర్తి డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న కే.క్రిష్ణ కిశోర్‌ను తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్‌డీపీవోగా, నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న పీ.రవీందర్ రెడ్డిని ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా బదిలీ చేశారు. ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీ డి.ప్రసన్న కుమార్‌ను మెదక్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌పర్ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పి.సదయ్యను, తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వి.సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. వీరంతా కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో డీజీపీ పేర్కొన్నారు.

# టెట్ దరఖాస్తులు ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) 2024 రెండో సెషన్ దరఖాస్తుల స్వీకరణ గురువారం రాత్రి ప్రారంభమైంది. ఈ మేరకు అధికారులు టెట్ పూర్తి నోటిఫికేషన్ ను వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు ప్రక్రియ నవంబర్ 5వ తేదీ నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా..సాంకేతిక కారణాలతో రెండు రోజులపాటు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. టెట్ ఫీజును తగ్గిస్తామని గత పరీక్షకు ముందు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన ప్రకారం ఈసారి టెట్ ఫీజును ప్రభుత్వం తగ్గించింది. ఒక్క పేపర్ కు రూ.750, రెండు పేపర్లకు రూ.2 వేలుగా ఫీజు నిర్ణయించింది. గత టెట్ నోటిఫికేషన్ కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రభుత్వం ఈసారి దరఖాస్తు ఫీజు లేకుండా పరీక్ష రాసే అవకాశం కల్పించింది. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ వరకు టెట్కు దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి ఒకటి నుంచి 20వ తేదీ వరకు ఆన్లైన్ విధానంలో టెట్ పరీక్షలు జరగనున్నాయి

# 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

- రాష్ట్రం నుంచి మెయిన్స్ కు ఎంపికైన వారికి ఇంధన శాఖ పక్షాన ఒక్కొక్కరికి లక్ష రూపాయలు
- మెయిన్స్ సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మిగితా 3వ పేజీలో

# పైసలు ఇయ్యలేదని అమ్మని ఎత్తుకెళ్లిండ్రు..

- వేములవాడ అర్బన్ మండలం కొడుముంజలో అమానుషం
- కొద్దిరోజులుగా మహారాష్ట్ర కాంట్రాక్టర్, కొడుముంజ మేస్త్రీకి మధ్య డబ్బుల వివాదం
- మేస్త్రీ తల్లిని ఎత్తుకెళ్లిన కాంట్రాక్టర్ అనుచరులు
- కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు



**బలగం టీవీ , సిరిసిల్ల :**

కొద్దిరోజులుగా మహారాష్ట్ర కాంట్రాక్టర్, కొడుముంజ మేస్త్రీకి మధ్య డబ్బుల వివాదం నడుస్తుండగా, మేస్త్రి తీసుకున్న డబ్బులివ్వడం లేదని కాంట్రాక్టర్ ఆ మేస్త్రీ తల్లిని బలవంతంగా తీసుకపోయినా సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం కోడుముంజ గ్రామంలో చోటు చేసుకుంది. వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ ఆ అండ్ ఆర్ కాలనీకి చెందిన పల్లపు శ్రీనివాస్, అతని సోదరుడు ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలో కూలీలుగా పనిచేస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన లాల్ దేవకర్ వద్ద చెరుకు పంట కోసేందుకు కూలీలను తీసుకొస్తానని చెప్పి శ్రీనివాస్ రూ.3లక్షలు అడ్వాన్స్ గా తీసుకున్నాడు. అయితే కూలీల కొరత కారణంగా శ్రీనివాస్ చెరుకు కోతకు కూలీలను తీసుకెళ్లలేక పోవడంతో తన డబ్బులు తిరిగివ్వాలని శ్రీనివాస్‌ను దేవకర్ అడుగగా, పలుమార్లు లాల్ దేవకరు శ్రీనివాస్ కు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే బుధవారం లాలు దేవకర్, మరికొంత మంది కొడుముంజ ఆర్ అండ్ ఆర్ కాలనీలోని శ్రీనివాస్ ఇంటికి వచ్చారు. ఆ సమయంలో శ్రీనివాస్,అతడి సోదరుడు ఇంటిలో లేకపోవడంతో డబ్బుల ఇవ్వాలని కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న శ్రీనివాస్ తల్లి పల్లపు భీమా బాయ్‌ను బలవంతంగా తమ వెంట కారులో బలవంతంగా తీసుకువెళ్లినారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రేవంత్ రెడ్డి 'ఒకే ఒక్కడు'

- పుస్తకాన్ని ఆవిష్కరించిన టీపీసీసీ చీఫ్‌మహేష్ కూమార్ గౌడ్

**బలగం టీవి, హైదరాబాద్**




సీఎం రేవంత్ రెడ్డి పై రాసిన ఒకే ఒక్కడు పుస్తకాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కూమార్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్ గా ఎదిగిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్ పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఆనాడు ఉన్న పాసిస్టు పాలన గురించి ప్రజలకు వివరించి.. టీపీసీసీ అధ్యక్షుడిగా నేతలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావటంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని మహేష్ కుమార్ గౌడ్ వివరించారు.

శుక్రవారం రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒకే ఒక్కడు పుస్తక ఆవిష్కరణ చేసుకున్నామని తెలిపారు. ఒకే ఒక్కడు పుస్తకాన్ని రచించిన వేణుగోపాల్ రెడ్డి, విజయార్కేకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటి నుంచి ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని .. ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మనస్సుపూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

# సిరిసిల్ల జిల్లాలో లక్షా 90 వేల 626 ఇండ్లు గుర్తింపు



- పకడ్బందీగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ..
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ పై మాస్టర్ ట్రైనర్లకు, సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పాల్గొన్నారు.సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణను మాస్టర్ ట్రైనర్లకు, సూపర్వైజర్ లు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులకు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల సామాజిక, ఆర్థిక , విద్య, ఉపాధి రాజకీయ , కుల సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సమగ్ర సర్వేలో భాగంగా 100% హౌస్ లిస్టింగ్ కార్యక్రమం పూర్తి చేసుకున్నామనిఅన్నారు .

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 1 లక్షా 90 వేల 626 ఇండ్లు , 1468 ఎన్యుమరేషన్ బ్లాక్ లలో ఉన్నాయని గుర్తించామని, ప్రతి 150 ఇండ్ల సర్వేకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున కొంతమంది రిజర్వ్ సిబ్బందితో కలిపి మొత్తం 1488 ఎన్యుమరేటర్లు , 160 మంది సూపర్వైజర్లను నియమించామని అన్నారు. ప్రతి మండలంలోని సూపర్వైజర్లు , ఎన్యుమరేటర్లకు సర్వే నిర్వహణ వివరాల సేకరణ ఆన్ లైన్ లో డాటా ఎంట్రీ తదితర అంశాలపై తహసిల్దారులు మండల ప్రత్యేక అధికారులు శిక్షణ అందించాలని, ఈ కార్యక్రమం నేడు, రేపు పూర్తి చేసుకోవాలని, గ్రౌండ్ లెవెల్ లో సిబ్బందికి ఎటువంటి అనుమానాలు రాకుండా పకడ్బందీగా శిక్షణ అందించాలని ఆదేశించారు.

నవంబర్ 9 నుంచి ప్రతి ఎన్యుమరేటర్ తనకు కేటాయించిన ఈబి బ్లాగ్ లోని ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ నిర్దేశించిన ఫార్మాట్ ప్రకారం వివరాలు పక్కాగా సేకరించాలని,15 రోజుల వ్యవధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి చేయాలని అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే షెడ్యూల్ పై టామ్ టామ్ నిర్వహించాలని, ఈరోజు ఎక్కడ సర్వే చేస్తారనే విషయం ప్రజలకు తెలియజేయాలని, సర్వే సమయంలో ప్రజలు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్ కార్డ్ , పాస్ పుస్తకాలు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.

ప్రతి రోజు నిర్వహించే సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఎన్యుమరేటర్ మండల స్థాయిలో తాసిల్దార్ కార్యాలయంలో అప్పగించాలని, ఆ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తే ఎందుకు అవసరమైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలని, అవసరమైన మేర కంప్యూటర్ సిస్టంలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు జరిగే సర్వే వివరాలను ఎంపీడీవో ఆధ్వర్యంలో సేకరించి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని అన్నారు. ఆన్ లైన్ లో సర్వే డేటా ఎంట్రీ పర్యవేక్షణకు నాయబ్ తహసిల్దార్ ఆధ్వర్యంలో 2 సిబ్బందితో బృందం ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సి.పి.ఓ. శ్రీనివాస చారి మండల ప్రత్యేక అధికారులు డి.ఎల్.ఎం.టి లు, సూపర్వైజర్లు ఎంపీడీవోలు తాసిల్దార్లు సంబంధించిన తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రికి జన్మదిన కానుక

- పట్టు వస్త్రంపై రేవంత్‌రెడ్డి ముఖచిత్రంను నేచిన సిరిసిల్ల నేతన్న హరిప్రసాద్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెల్ది హరిప్రసాద్ మరోసారి తన ప్రతిభను చాటుకున్నాడు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఫోటోను మగ్గంపై నేచాడు.నవంబర్ 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చేనేతలో ఎన్నో అద్భుతాలు చేసిన సిరిసిల్ల వెల్ది హరిప్రసాద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పట్టు వస్త్రంపై తెలంగాణ ముఖచిత్రంతో రేవంత్ రెడ్డి ఫోటో వచ్చే విధంగా దాదాపు ఐదు రోజుల పాటు శ్రమించి తయారు చేశాడు. నవంబర్ 8 పుట్టినరోజు సందర్భంగా అవకాశం కల్పిస్తే ఈ పట్టు వస్త్రాన్ని ముఖ్యమంత్రి కి అందిస్తానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. సీఎం రేవంత్ రెడ్డిని కలిపించి ఈ కానుకను అందించే విధంగా అవకాశం కల్పించాలని సిరిసిల్ల నేతన్న హరిప్రసాద్ వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు విజ్ఞప్తి చేశారు.

# అక్రమంగా తరలిస్తున్న 48 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

- ఏడుగురిపై తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు,మినీ వ్యాన్ స్వాధీనం.



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలం జిల్లెళ్ల నుండి ప్రశాంత్, శ్రీను,సముద్రాల ప్రశాంత్, నితిన్ అనే నలుగురు వ్యక్తులు గురువారం ఉదయం 3 గంటల సమయంలో అక్రమంగా రేషన్ బియ్యం మినీ వ్యాన్ వాహనంలో తరలిస్తున్నరన్న సమాచారంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తంగళ్ళపల్లి పోలీసులు మరియు జిల్లా టాస్క్ పోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నెరెళ్ళ వద్ద వారిని అదుపులోకి తీసుకొని అట్టి 48 క్వీటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేసి విచారించారు.రాజు, గుగులోతు అంగుర,పాండులు అనే ముగ్గురు వ్యక్తులు గ్రామాల్లో వివిధ ప్రాంతాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు వేరే ప్రాంతాల్లో అమ్ముతారని వారి ఆదేశాల మేరకె మేము రేషన్ బియ్యం తరలిస్తున్నామని చెప్పగా వారిని కూడా అదుపులోకి తీసుకొని ఏడుగురిపై తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని తంగళ్ళపల్లి ఎస్.ఐ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ పేదలకు అందవలసిన ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసిన, రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ టాస్క్ లో తంగళ్ళపల్లి ఎస్.ఐ రామ్మోహన్,టాస్క్ పోర్స్ ఎస్.ఐ సుధాకర్, టాస్క్ పోర్స్ సిబ్బంది తిరుపతి, మహిపాల్, శ్రీనివాస్,రాజేష్ ,సిబ్బంది పాల్గొన్నారు.

# వరి కొయ్యకాలు తగలబెట్టవద్దు

- మండల వ్యవసాయ అధికారి ప్రణీత

**బలగం టీవీ , బోయినిపల్లి**



వరి కొయ్యకాలు తగలబెట్టవద్దు అని మండల వ్యవసాయ అధికారి ప్రణీత సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ప్రణీత పంటల నమోదు పరిశీలనలో భాగంగా రైతులతో మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక ప్రమాదాలు సంభవించడమే కాకుండా ఆస్తి, ప్రాణ నష్టంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని,వరి కొయ్యకలకు నిప్పుపెడితే భూమి సారాన్ని కోల్పోవడంతో పాటు దిగుబడి తగ్గుతుందని,అలాగే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని అన్నారు. పొలాన్ని కలియ దున్నితేనే పంటకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

"గతంలో వరి పంటను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారని, అంతేకాకుండా పశువులు ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలుకుప్పలుగా పశు గ్రాసం కోసం నిల్వ చేసేవారని, అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు రావడం, పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు.మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని కోసి తీసుకొచ్చుకుని,మిగిలిన దానిని అక్కడే వదిలేస్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని,రైతులు వరికొయ్యలతో పాటు గడ్డిని కూడా కాలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశముందని,ఎట్టి పరిస్థితుల్లోనూ వరికొయ్యలను తగులబెట్టొద్దని రైతులను విజ్ఞప్తి చేశారు.వరికొయ్యలను (కొయ్యకాలు) కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. దిగుబడి పోతుందని,భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి" అని అన్నారు.

"పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. పొలాల గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుంది. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాల దగ్గరే ఉన్న ధాన్యం కాలిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు.వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. వరి కొయ్యలను పొలంలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుళ్లిపోతాయి. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడటంతో దిగుబడి పెరుగుతుంది. తద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చు" అని రైతులకు సూచించారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

- మాదకద్రవ్యాలను,గంజాయి వంటి పదార్థాలను కనిపెట్టే నార్కోటిక్, డాగ్స్ స్క్వాడ్ చే తనిఖీలు
- అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- డీఎస్పీ

**బలగం టీవీ , తంగళ్లపల్లి**



శాంతి భద్రతల పరిరక్షణయే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుంది అని డీఎస్పీ అన్నారు. అందులో భాగంగానే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశానుసారం గురువారం సాయంత్రం తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కెసిఆర్ నగర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి, సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 76 ద్విచక్ర వాహనాలు ,ఒక ఆటో,రెండు కార్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని, సబంధించిన వాహన దారులకు సరైన పత్రలు చూపించి వాహనాలు తీసుకవెళ్ళగలరని డిఎస్పీ తెలిపారు.


డీఎస్పీ మట్లాడుతూ ప్రజల రక్షణ గురించి ప్రజలలో భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం, ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. పట్టణ,గ్రామంలో, కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు కానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని, గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతూ వుంటే వెంటనే పోలీసులకు,లేదా డయల్ 100 కాల్ కు చేసి సమాచారం అందించాలని వెంటనే చర్యలు చేపడ తాం అన్నారు. అదేవిధంగా మాదక ద్రవ్యాలను, గంజాయి వంటి మత్తు పదార్థాలను నివృత్తి చేయ గల జాగిలల చే విస్తృత తనిఖీలు నిర్వహించారు.

గ్రామాల్లో,కాలనీలల్లో యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,గ్రామాల్లో గంజాయి,గుడుంబా తయారీకి సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్ వారికి సమాచారం అందించాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలల్లో,నేరాల నియంత్రణ లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ మొగిలి,ఎస్.ఐ రామ్మోహన్, శ్రీకాంత్,గణేష్,ఆర్.ఎస్.ఐ దిలీప్,పోలీస్ సిబ్బంది , డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కులగణనను కురుమ కులస్థులు సద్వినియోగించుకోవాలి

- రాజన్న సిరిసిల్ల జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు ఏనుగుల కనుకయ్య



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపడుతున్న కులగణనను జిల్లాలో ఉన్న కురుమలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు ఏనుగుల కనుకయ్య సూచించారు. గురువారం ఏనుగుల కనుకయ్య మండల కేంద్రంలో మాట్లాడుతూ: కులగణన సమయంలో అధికారులు ఇంటి వద్దకు వచ్చినప్పుడు కులం దగ్గర బీసీ–బీ అని, కురుమ అని తప్పకుండ రాయించాలని అన్నారు. అప్పుడే మన జనాభా ఎంత ఉందో, ప్రభుత్వలకు తెలుస్తుందని అన్నారు. కురుమలు రాజకీయంగా, విద్య పరంగా ఎదగడానికి ఇది మంచి అవకాశం అని అన్నారు. ఈ సమావేశంలో కురుమ సంఘ వేములవాడ పట్టణ అధ్యక్షులు గుంటి కనుకయ్య, మాజీ జోగాపూర్ ఎంపీటీసీ గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్ములా-ఈ రేస్ వల్ల లాభమే జరిగింది

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. అంతమేర ప్రభుత్వానికి నష్టం చేసిన మేఘా కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టే దుమ్ముందా? అని రేవంత్ సర్కారును కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకూ వదిలిపెట్టమని హెచ్చరించారు. రేస్ వల్ల జరిగే లాభం రేవంత్ రెడ్డికి తెలియదు. చెప్తే వినరు. కూలగొట్టుడు తప్ప నిర్మాణం తెల్వదు. పాజిటివ్ మనషులు కాదు. పిచ్చోళ్ల లాగా నా మీద కోపంతో రేస్‌ను క్యాన్సిల్ చేశారు. మా కేసీఆర్ గవర్నమెంట్‌లో ఫార్ములా ఈ రేస్ తీసుకొస్తే.. రేవంత్ రెడ్డేమో ఇంటర్నేషనల్ షేమ్ తెచ్చిండు. ప్రపంచంలో మన పరువు తీసిండు. రేవంత్ రెడ్డి చేసిన తప్పు వల్ల 800 కోట్ల నష్టం వచ్చిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# సమ్మర్ డిమాండ్‌ను తట్టుకునేలా చర్యలు...

- సీఎండీ ముషారఫ్ ఫరూఖి, ఐఏఎస్..

**బలగం టీవీ , హైదరాబాద్**

రానున్న వేసవిలో ఏర్పడే అధిక విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా పంపిణీ మరియు ట్రాన్స్ మిషన్ వ్యవస్థను మెరుగుపర్చాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ అధికారులను సూచించారు. గురువారం, మింట్ కాంపౌండ్ లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ట్రాన్స్ కో డైరెక్టర్/ ట్రాన్స్మిషన్ శ్రీ జగత్ రెడ్డి, ఇతర ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

గ్రేటర్ హైదరాబాద్ నగరం లో వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవు తుంది. గతేడాది 3756 మెగావాట్లుగా నున్న గరిష్ట డిమాండ్ ఈ ఏడాది దాదాపు 16 % వృద్ధి తో 4352 మెగావాట్ల గా నమోదయ్యింది, గతేడాది 81.39 మిలియన్ యూనిట్లుగా నున్న వినియోగం దాదాపు 12 % వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది. రాబోయే 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతం కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో సుమారు 20 - 25 % వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేశారు.

గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాలైన నెమలి నగర్, గోపన్ పల్లి, కోకాపేట్, కోహెడ, తట్టి అన్నారం, అబ్దుల్లాపూర్ మెట్, మాన్సాన్ పల్లి, అజీజ్ నగర్, కందుకూరు, కే సింగారం, మల్లాపూర్, వాయుపురి, ఉప్పల్ భాగాయత్, దుండిగల్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్నది. ఆ ప్రాంతాల్లో అవసరానికి తగ్గట్టు 220/132/33 కేవీ సబ్ స్టేషన్స్ ఏర్పాటు, ఇతర నెట్వర్క్ ను పటిష్టం చేయడానికి తగు చర్యలు చెప్పట్టాలని ఉన్నతాధికారులకు సీఎండీ దిశానిర్దేశం తెలిపారు.

ప్రస్తుతం చేపడుతున్న నిర్వహణ మరమ్మతు పనులను నాణ్యత ప్రాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలన్నారు. నిర్వహణ పను ల కోసం తీసుకుంటున్న లైన్ క్లియరెన్స్ విషయం లో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్సీ లు తీసుకునేటప్పుడు ట్రాన్స్కో అండ్ డిస్కం ఇంజినీర్లు సమన్వయము చేసుకోవాలన్నారు. సంక్రాంతి లోపుగా 100 శాతం నిర్వహణ పనులు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశం లో ట్రాన్స్ కో డైరెక్టర్ ట్రాన్స్మిషన్ జగత్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ డా. నర్సింహులు, చీఫ్ ఇంజినీర్ / టీఎల్ అండ్ ఎస్–ఎస్ / మెట్రో జోన్, ట్రాన్స్ కో రాంజీ, చీఫ్ ఇంజినీర్ మెట్రో చక్రపాణి, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యాంటీ టెర్రర్ కాన్ఫరెన్స్-2024' ప్రారంభం



- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

**బలగం టీవీ , హైదరాబాద్**

ఉగ్రవాదంపై పోరుకు త్వరలో విధివిధానాలు రూపొందిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యాంటీ టెర్రర్ కాన్ఫరెన్స్–2024' ప్రారంభోత్సవంలో అమిత్ షా మాట్లాడారు. యూఏపీఏ కేసులతో ఎన్ఐఏ దాదాపు 95శాతం నేరారోపణ రేటును సాధించడంలో విజయం సాధించిందన్నారు. తీవ్రవాదంపై మోడీ ప్రభుత్వ చర్యల వల్ల గత దశాబ్దంలో 70శాతం ఘటనలు తగ్గాయని తెలిపారు. టెర్రర్‌ఫైనాన్సింగ్, క్రిప్టో వంటి కొత్త సవాళ్లను ఎదుర్కోవటానికి, పోలీసు స్టేషన్ల నుంచి డీజీపీ కార్యాలయం వరకు సమన్వయ విధానాన్ని అనుసరించాలన్నారు. టెర్రర్–ఫైనాన్సింగ్‌ను ఆపడానికి 25 పాయింట్ల సమగ్ర ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. జిహాదీ ఉగ్రవాదం నుంచి ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాటు, నక్సల్స్, నకిలీ కరెన్సీ, మాదకద్రవ్యాల వరకు అనేక చర్యలు వంటివి ఇందులో భాగమని వెల్లడించారు. అవసరమైనప్పుడు సంకోచం లేకుండా యూఏపీఏ ఉపయోగించాలని, దర్యాప్తులో ఎన్ఐఏ సహాయం తీసుకోవాలని సూచించారు. ఉగ్రవాదానికి సరిహద్దులు లేవని, కానీ రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు వాటి స్వంత సరిహద్దులు ఉన్నాయని తెలిపారు. కాబట్టి అన్ని రాష్ట్రాలు ఎన్ఐఏ ఉపయోగాన్ని నొక్కి చెప్పడంతో పాటు, ఉగ్రవాదంపై పోరాడే సంస్థలతో సమన్వయాన్ని పెంచుకోవాలని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తోందని, అంతర్గత భద్రత కోసం సరిహద్దుల వద్ద ఇప్పటి వరకు 36 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఉగ్రవాద కార్యకలాపాల కట్టడి విషయంలో మోడీ ప్రభుత్వం జీరో టాలరెన్స్ నినాదంతో ముందుకెళ్తోందని, ప్రస్తుతం ప్రపంచమంతా ఈ విధానాన్నే అనుసరిస్తోందన్నారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు బలమైన వ్యవస్థను ఏర్పాటు చేశామని, అయితే ఉగ్రవాదులు ఎలా దాడి చేసినా దాన్ని మనం ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. అందుకు యువ అధికారులకు అత్యున్నత సాంకేతిక నైపుణ్యం అవసరమని నొక్కిచెప్పారు. భవిష్యత్తులో వారి శిక్షణలోనూ దీన్ని భాగం చేస్తామని వివరించారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ (ఐబీ) తపన్ కుమార్ దేకా, డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ పంకజ్ సింగ్, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ డేట్ తదితరులు పాల్గొన్నారు.

# అఘోరి ఆత్మహత్యాయత్నం

**బలగం టీవీ , హైదరాబాద్**

ఏపీలోని శ్రీకాళహస్తి ఆలయం ముందు మహిళా అఘోరి ఆత్మహత్యాయత్నం చేసింది. ఒంటిపై, తన కారుపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయడంతో స్థానికులు, పోలీసులు అడ్డుకున్నారు. బిందెలతో నీళ్లు కుమ్మరించి అఘోరికి వస్త్రాలు చుట్టారు. ఆలయం లోపలికి వెళ్లడానికి అనుమతించకపోవడం వల్లే అఘోరి ఆత్మహత్యా యత్నం చేసినట్లు సమాచారం. తెలంగాణలోని సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిలో దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత మహిళా అఘోరి ముత్యాలమ్మ ఆలయం సందర్శించారు. ఆ తర్వాత నిత్యం ఏదో ఒక ఆలయాన్ని సందర్శిస్తూ వార్తల్లో నిలిచారు. సనాతన ధర్మం కోసం ఆత్మార్పణ చేసుకుంటానని ప్రకటించడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. దీంతో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమవుతుందని పోలీసులు మహిళా అఘోరిని రాష్ట్రం విడిచి వెళ్లాలని ఆదేశించారు. దీంతో మహారాష్ట్రకు వెళ్లిన అఘోరి అక్కడి ఆలయాలను సందర్శించు కున్నారు. ఈ క్రమం లోనే మహిళా అఘోరి గురువారం అకస్మాత్తుగా శ్రీకాళహస్తిలో ప్రత్యక్షమయ్యారు. స్వామి వారి దర్శనం కోసం వెళుతుండగా పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం చెందిన మహిళా అఘోరి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎట్టిపరిస్థితుల్లోనూ స్వామిని దర్శించుకోకుండా వెళ్లబోనని, అవసరమైతే ఆత్మార్పణ చేసుకుంటానని బెదిరించారు. అయినా పోలీసులు గుడి లోపలికి అనుమతించకపోవడంతో కారు వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు స్థానిక మహిళలతో కలిసి అఘోరిపై నీళ్లు కుమ్మరించారు.

# 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు




బలగం టీవీ, హైదరాబాద్

ఎన్నికల ముందు ప్రకటించినట్టుగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు.

ఈ రాష్ట్రం కోరి కొట్లాడి తెచ్చుకున్నదే ఉద్యోగాల సాధన కోసం అని అన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని తరహాలో ఉద్యోగాల భర్తీకి ప్రతి ఏటా వార్షిక క్యాలెండర్ విడుదల చేస్తున్నామని చెప్పారు . ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తామో ముందే తెలియజేస్తున్నామని ఆ పనిలో భాగంగా ఇప్పటికే గ్రూప్ -1 పరీక్షలు విజయవంతంగా నిర్వహించామని, గ్రూప్ -2 పరీక్షలు నిర్వహించబోతున్నామని వెల్లడించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో విజయవంతంగా ఉద్యోగాల భర్తీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మేధస్సు ఉన్నప్పటికీ నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలవారు ఆర్థిక ఇబ్బందులతో యుపిఎస్సి పరీక్షలను సాధించడంలో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మన రాష్ట్రం నుంచి మెయిన్స్ కు ఎంపికైన వారికి ఇంధన శాఖ పక్షాన ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహంగా అందించినట్లు తెలిపారు. మెయిన్స్ సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా లక్ష రూపాయలు ప్రోత్సాహంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి మెటీరియల్, ప్రత్యేక శిక్షణ వంటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు వివరించారు. సివిల్ సర్వీస్ కు మన రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ఎంపిక అయితే మన ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సివిల్ సర్వీస్ అయినప్పటికీ పాలన లో మనవాళ్లు ఎంత ఎక్కువ మంది ఉంటే ప్రాంతీయ అభిమానంతో సంక్షేమ పథకాలు, బడ్జెట్ రూపకల్పన, ఇతర అంశాల ద్వారా మన రాష్ట్రానికి అంత ఎక్కువ లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుందన్నారు. యూపీ క్యాడర్లో పనిచేస్తున్నప్పటికీ ప్రాంతీయ అభిమానంతో తెలుగు వారైన మోహన్ రావు, అరుణ ల ఆధ్వర్యంలో హైదరాబాదులో యుపిఎస్సి కోచింగ్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఏ అంశాలపై దృష్టి పెట్టి, ఎలా చదివితే ఎంపిక అవుతామో తెలుసుకుంటే ఎక్కువమంది సివిల్ సర్వీసెస్ కు ఎంపిక అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఉత్తర భారత దేశంలో ఎక్కువ అకాడమీలు అందుబాటులో ఉండడంతో ఆ రాష్ట్రాల నుంచి సివిల్ సర్వీసెస్ కు ఎక్కువమంది ఎంపిక అవుతున్నారని తెలిపారు. మన రాష్ట్రానికి మేలు జరగాలంటే పెద్ద సంఖ్యలో సివిల్స్ కోచింగ్ అకాడమీలు రావలసిన అవసరం ఉందన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో దోపిడీ రాజ్యమేలుతున్నది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



బలగం టీవి, హైదరాబాద్

ఇందిరమ్మ రాజ్యంలో దోపిడీ రాజ్యమేలుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతుల రెక్కలకష్టం దర్జాగా దళారుల పాలవుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆఫీసులో కనుగోలు కేంద్రం తప్ప రాష్ట్రంలో ఒక్క కొనుగోలు కేంద్రం పనిచేస్తలేదని విమర్శించారు. ఏ రైతుకు ముఖ్యమంత్రి మద్దతు లేదని, అందుకే వరికి, పత్తికి, దేనికీ మద్దతు ధర లేదని ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు. సన్నాలకే బోనస్ అన్న సన్నాసుల మాట మార్కెట్ యార్డుల సాక్షిగా నీటిమూటే అయ్యిందని విమర్శించారు. మొన్న రైతుకు రుణమాఫీ చెయ్యలే, నిన్న రైతుకు పెట్టుబడి సాయం ఇయ్యలేదని చెప్పారు. నేడు రైతు పండించిన పంటను కొనుగోలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక.. ఈ ఇందిరమ్మ రాజ్యం ఉండెందుకు.. ఆరుగాలం కష్టించే అన్నదాతను అరిగోస పెట్టేటందుకా అని ప్రశ్నించారు.

# అంగన్‌వాడీ టీచర్ దారుణ హత్య

బలగం టీవి, హైదరాబాద్

తనను పెళ్లి చేసుకోవడంలేదని ఓ ప్రేమోన్మాది.. అంగన్‌వాడీ టీచర్ ను దారుణంగా హత్య చేశాడు. ఈ విషాద సంఘటన ఓడిసాలోని సుందర్‌ఘర్ జిల్లా హేమగిరి పోలీసు పరిధిలోని జులుంబహల్ పురానా గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దివ్యభారతి అనే అంగన్‌వాడీ టీచర్ ను శరత్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో చాలా కాలంగా వెంబడిస్తున్నాడు. అంతేకాదు పలుమార్లు తనని పెళ్లి చేసుకోమని వేధించాడు. అందుకు ఆమె ఒప్పుకోలేదు. అతడి తీరును మార్చుకోమని కూడా దివ్య హెచ్చరించింది. అయినా ఆమె వెంటపడుతూనే ఉన్నాడు. ఎంతకీ తనను పెళ్లి చేసుకునేందుకు ఒప్పుకోవడం లేదని రెచ్చిపోయిన శరత్.. ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మాటు వేసిన శరత్.. పదునైన కత్తితో ఆమెపై దాడి చేశాడు. దాంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు శరత్ అక్కడి నుంచి పరారయ్యాడు. మృతురాలి మేనమామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న హేమగిరి పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



# మధురానగర్ హనుమాన్ ఆలయంలో జాన్వీ కపూర్ పూజలు..

బలగం టీవి, హైదరాబాద్

బాలీవుడ్ హీరోయిన్ జాన్వీకపూర్ గురువారం హైదరాబాద్ మధురానగర్ లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె అభిమానులు భారీగా ఆలయం దగ్గరికి చేరుకున్నారు. జాన్వీతో ఫోటోలు దిగేందుకు పోటీ పడ్డారు.కాగా, ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు సినిమాలో జాన్వీ నటిస్తున్నది.

# యువకుడు ఆత్మహత్య

బలగం టీవి, హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ లో విషాదం చోటుచేసుకుంది. ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన సాయికుమార్ హైదరాబాద్ లో ఎలక్ట్రిషియన్ పని చేస్తూ చదువు కొనసాగిస్తున్నాడు. సాయికుమార్ అనే యువకుడు ఓ యువతిని ప్రేమించాడు. ఇద్దరు మధ్య మనస్పర్థలు రావడంతో ప్రేమ విఫలమయిందని తీవ్ర మనస్తాపం చెందాడు. బుధవారం అర్ధరాత్రి గదిలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బెంగళూరుకు హైడ్రా బృందం

- బెంగళూరుకు హైడ్రా చీఫ్ రంగనాథ్ బృందం
- తక్కువ ఖర్చు తో బెంగుళూరు లో 35 చెరువులను అభివృద్ధి చేసిన కర్ణాటక ప్రభుత్వం.
- మూడు రోజుల పాటు స్టడీ చేయనున్న హైడ్రా బృందం.
- చెరువుల పరిరక్షణకు, తీసుకుంటున్న చర్యలపై..
- క్షేత్రస్థాయిలో పరిశీలించనున్న హైడ్రా బృందం.

బలగం టీవి, హైదరాబాద్



చెరువుల పునరుద్ధరణ, విపత్తుల నిర్వహణపై అధ్యయనానికి హైడ్రా అధికారుల బృందం బెంగళూరు వెళ్లింది. బుధవారం హైడ్రా అధికారులు బెంగళూరు వెళ్లగా గురువారం కమిషనర్ రంగనాథ్ అక్కడికి చేరుకున్నారు. రెండు రోజుల పాటు బెంగళూరులోనే పర్యటించి అక్కడి చెరువుల పునరుద్ధరణపై సీనియర్ శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రముఖులతో సమావేశం కానున్నారు. యెల్లంకలో ఉన్న కర్ణాటక స్టేట్ నాచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను హైడ్రా అధికారుల బృందం సందర్శించనుంది.

తక్కువ ఖర్చుతో కర్ణాటక ప్రభుత్వం బెంగుళూరులో 35 చెరువులను అభివృద్ధి చేసింది. చెరువుల పరిరక్షణకు, తీసుకుంటున్న చర్యలపై.. హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పర్యటిస్తున్నారు. పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత సిటీలో మొదటి దశలో నాలుగు చెరువుల ప్రక్షాళనపై ఫోకస్ పెట్టనున్నారు. బాచుపల్లి ఎర్రగుంట చెరువు, మాదాపూర్ సున్నం చెరువు, కూకట్ పల్లి నల్ల చెరువు, రాజేంద్రనగర్ అప్ప చెరువులకు హైడ్రా పునరుజ్జీవం తేనుంది.

నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్ విపత్తు నిర్వహణపై సీనియర్ శాస్త్రవేత్తలతో సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి సెన్సార్స్ సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తారు. బెంగళూరు కోర్ సిటిలో ఉన్న చెరువులను సందర్శిస్తారు. రెండో రోజు పర్యటనలో 'లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా' ఆనంద్ మల్లిగవాడ్‌తో కమిషనర్ రంగనాథ్ సమావేశం కానున్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోన్హళ్లీ చెరువు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతికతను తెలుసుకోనున్నారు.



# జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో ఎమ్మెల్యేల బాహాబాహీ

బలగం టీవి, హైదరాబాద్

జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో గురువారం ఎమ్మెల్యేలు బాహాబాహికి దిగారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకాధికారాలు కల్పించే 370 అధికరణపై చేసిన తీర్మానంగందరగోళ పరిస్థితులకు దారితీసింది.అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో స్పీకర్ సభను కొద్ది సేపు వాయిదా వేశారు.

370 అధికరణను పునరుద్ధరించాలని కోరుతూ జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం గురించి ప్రతిపక్ష నేత సునీల్ శర్మ అసెంబ్లీ మాట్లాడుతున్నారు. ఇంతలో ఇంజినీర్ రషీద్ సోదరుడు, అవామీ ఇత్తేహాద్ పార్టీ ఎమ్మెల్యే ఖుర్షీద్ అహ్మద్ షేక్ ఆర్టికల్ 370 పునరుద్ధరించాలంటూ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూకారు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ఆ వెల్‌లోకి ప్రవేశించి బ్యానర్‌ను లాక్కునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో బ్యానర్ చిరిగిపోయింది. ఎమ్మెల్యేలు ఒకరిపై మరొకరు దూసుకుపోయి దాడులు చేసుకున్నారు. గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో స్పీకర్ అబ్దుల్ రహీం సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తర్వాత బీజేపీ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో సభ నుంచి బయటికి వెళ్లాలని స్పీకర్ వారికి సూచించారు. అందుకు నిరాకరించిన బీజేపీ ఎమ్మెల్యేలను మార్షల్స్ బయటకు లాక్కెళ్లారు. గట్టిగా తోసుకోవడం వల్ల కొందరు ఎమ్మెల్యేలు కిందపడిపోయారు.



# శ్రేయస్ అయ్యర్ డబుల్ సెంచరీ



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రికెట్ జట్టు బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ రంజీ ట్రోఫీలో డబుల్ సెంచరీ చేశాడు. ముంబయి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఈ స్టార్ క్రికెటర్, ఒడిశాపై డబుల్ సెంచరీ బాదాడు. 228 బంతుల్లో 24 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 233 పరుగులు చేశాడు. అంతకుముందే మహారాష్ట్రపై సెంచరీ బాదిన శ్రేయస్, ఒడిశాపైనా విరుచుకుపడ్డాడు.

ముంబయి- ఒడిశా మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అయ్యర్ మొదటి నుంచి దూకుడుగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. బౌండరీలతో చెలరేగిన శ్రేయస్ రంజీల్లో తన రెండో డబుల్ సెంచరీని పూర్తి చేశాడు. ఈ క్రమంలో ముంబయి జట్టు 4 వికెట్ల నష్టానికి 602 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు డిక్లేర్ చేసింది.

కొన్ని రోజులుగా టెస్టుల్లో భారత బ్యాటర్లు ఆశించిన మేర రాణించడం లేదు. దీంతో న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్ ను 0-3తో భారత్ కోల్పోయింది. ఇప్పుడు ఫామ్‌లోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్, టీమ్‌ఇండియాకు ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. మరి అతడికి జట్టులో చోటు కల్పిస్తారా? లేదా? అన్నది చూడాలి.



## బ్యాడ్మింటన్ అకాడమీకి పీవీ సింధు భూమిపూజ

**బలగం టీవీ, విశాఖపట్నం**

విశాఖపట్నంలోని పెద గదిలి కూడలి సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు తన తల్లిదండ్రులతో కలిసి భూమిపూజ చేశారు. బ్యాడ్మింటన్‌పై ఆసక్తి ఉన్న చిన్నారులు, యువతను ఉన్నత స్థాయి పోటీల్లో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా పీవీ సింధు అన్నారు. పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అకాడమీ సామర్థ్యం, శిక్షణ తదితర వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. ఇక్కడ సుమారు మూడెకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు కేటాయించింది.

# ఇండియా-ఏ 161 ఆలౌట్



**బలగం టీవీ, మెల్‌బోర్న్**

: ఆస్ట్రేలియా-ఏతో మెల్‌బోర్న్‌లో జరుగుతున్న రెండవ అనధికార టెస్టులో ఇండియా-ఏ జట్టు కేవలం 161 పరుగులకే ఆలౌటైంది. కీపర్ ధ్రువ్ జురెల్ అత్యధికంగా 80 రన్స్ చేశాడు. ఓపెనర్‌గా వచ్చిన కేఎల్ రాహుల్ కేవలం 4 పరుగులకే అవుటయ్యాడు. స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో అతను ఔట్ అయ్యాడు. ఇక బెంగాల్ కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ డకౌట్ అయ్యాడు.ఆస్ట్రేలియాతో జరిగే తొలి టెస్టు మ్యాచ్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ స్థానంలో ఈశ్వరన్ అందుబాటులో ఉంటాడు.

ఇండియన్ బ్యాటర్లలో పడిక్కల్ 26, నితీశ్ కుమార్ రెడ్డి 16, జురెల్ 80, ప్రసిద్ధ్ కృష్ణ రన్స్ చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైఖేల్ నీసర్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ బ్యూ వెబ్‌స్టర్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఏ జట్టు 17.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 53 పరుగులు చేసింది. అప్పుడు వర్షం పడడంతో తొలి రోజు ఆట ముగిసినట్లు అంపైర్లు ప్రకటించారు.

# కెప్టెన్‌తో బౌలర్ గొడవ

- మైదానం విడిచి వెళ్లిన వైనం



**బలగం టీవీ, బ్రిడ్జ్‌టౌన్**

విండీస్ కెప్టెన్ హోప్‌తో గొడవ పడిన బౌలర్ అల్జరీ జోసెఫ్ కోపంలో మైదానం విడిచి డగౌట్‌కు వెళ్లాడు. అయితే ఓ ఓవర్ తర్వాత మళ్లీ తిరిగి వచ్చాడు. ఇంగ్లండ్‌తో జరిగిన మూడవ వన్డేలో ఈ ఘటన చోటుచేసుకున్నది. వివరాల్లోకెళ్తే.. బ్రిడ్జ్ టౌన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో వెస్టిండీస్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో 3 వన్డేల సిరీస్ ను 2- 1 తేడాతో విండీస్ జట్టు దక్కించుకుంది. అయితే ఈ మ్యాచ్‌లో ఓ ఆసక్తికర సంఘటన జరిగింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన విండీస్ కెప్టెన్ హోప్ తొలుత ఇంగ్లాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌కు శుభారంభం దక్కలేదు. మూడో ఓవర్‌లోనే ఓపెనర్ విల్ జాక్స్ వికెట్ కోల్పోయింది. దీంతో ఫస్ట్ డౌన్‌లో యువ ఆటగాడు జోర్డాన్ కాక్స్ క్రీజులోకి వచ్చాడు. ఈ క్రమంలో కాక్స్ కోసం విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ స్లిప్‌లో ఇద్దరు ఫీల్డర్లను సెట్ చేశాడు.అయితే నాలుగో ఓవర్ బౌలింగ్ చేసేందుకు వచ్చిన జోసెఫ్‌కు ఈ ఫీల్డ్ ప్లేస్‌మెంట్ నచ్చలేదు. దీంతో హోప్‌తో జోసెఫ్ వాగ్వాదానికి దిగాడు. అతడితో గొడవ పడుతూనే ఓవర్‌ను పూర్తి చేశాడు. ఆ ఓవర్‌లో నాలుగో బంతికి కాక్స్‌ను జోసెఫ్ ఔట్ చేశాడు. వికెట్ తీసినప్పటికీ జోసెఫ్ కనీసం సెలబ్రేట్ కూడా చేసుకోలేదు. సహచర ఆటగాళ్లు తన దగ్గరకి వచ్చినప్పటికి జోసెఫ్ మాత్రం సీరియస్‌గా హోప్‌తో తన వాగ్వాదాన్ని కొనసాగించాడు. అంతటితో ఆగని జోసెఫ్ తన ఓవర్ పూర్తి కాగానే మైదానం విడిచిపెట్టి డగౌట్‌కు వెళ్లిపోయాడు. దీంతో ఒక ఓవర్ మొత్తం విండీస్ జట్టు 10 మందితోనే ఫీల్డింగ్ చేయడం గమనార్హం. ఆ తర్వాత కోచ్ సామీతో సంప్రదింపులు జరిపిన తర్వాత జోసెఫ్ మళ్లీ మైదానంలోకి వచ్చాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## పుష్ప 2'కు థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్.?

**బలగం టీవీ, హైదరాబాద్**

అల్లు అర్జున్ నటిస్తున్న మూవీ పుష్ప 2. ఈ సినిమా విడుదలకి ఇంకా నెల రోజులు కూడా లేదు. ఇప్పటికే ఫస్ట్ ఆఫ్‌కి సంబంధించి పనులు అన్ని పూర్తి అవ్వగా సెకండ్ పార్ట్‌లో ఐటం సాంగ్ మినహా మిగత అన్ని పనులు పూర్తి అయినట్లు తెలుస్తుంది. అయితే ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించి ఒక షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ సినిమాకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనిని థమన్‌కు అప్పగించబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే థమన్ కూడా కొన్ని బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌లను సుకుమార్‌కి వినిపించినట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

అలాగే పుష్ప 2కి ముగ్గురు మ్యూజిక్ కంపోజర్లు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించనున్నట్లు కూడా టాక్ వినిపిస్తోంది. ప్రాజెక్టులోకి తమన్‌తోపాటు అజనీష్ లోక్‌నాథ్ (కాంతారా, మంగళవారం ఫేమ్), సామ్ సీఎస్ కూడా అడుగు పెట్టారని సమాచారం. అయితే మూవీని డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలను ప్లాన్ చేశారు మేకర్స్. అప్పటిలోగా బీజీఎం వర్క్స్ పూర్తవుతాయా? లేదా? మరోసారి మూవీ రిలీజ్ వాయిదా పడుతుందా? అని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ చిత్రంలో రష్మిక మందాన్న హీరోయిన్‌గా నటిస్తుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది.





## 'థగ్ లైఫ్' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

: కోలీవుడ్ స్టార్ హీరో కమల్ హాసన్ బర్త్‌డే సందర్భంగా ఆయన కొత్త చిత్రం 'థగ్ లైఫ్?' నుంచి మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. అందులోనే వచ్చే ఏడాది జూన్ 5న ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు.ఇక 'థగ్ లైఫ్' సినిమా విషయానికి వస్తే, సముద్రపు దొంగల నేపథ్యంలో సాగే ఓ యాక్షన్ డ్రామాగా ఈ మూవీ రూపొందుతోంది. 'నాయకన్' (నాయకుడు) లాంటి హిట్ తర్వాత కమల్– మణిరత్నం కాంబోలో తెరకెక్కుతోన్న రెండో చిత్రం ఇది. కోలీవుడ్ సీనియర్ నటి త్రిష కృష్ణన్, ఐశ్వర్య లక్ష్మి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరితో పాటు జోజూ జార్జ్, జయం రవి, నాజర్, పంకజ్ త్రిపాఠి, గౌతమ్ కార్తిక్ తదితరులు నటిస్తున్నారు. కమల్ తన సొంత బ్యానరైన రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ ఈ సినిమా నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, ఆయనతో పాటు మద్రాస్ టాకీస్ బ్యానర్‌పై శివ అనంత్, ఆర్ మహేంద్రన్ కూడా ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు.

## అనుష్క 'ఘాటి' ఫస్ట్‌లుక్ విడుదల



సీనియర్ హీరోయిన్ అనుష్క, డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఓ క్రేజీ ప్రాజెక్టు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమాకు ఘాటి అనే టైటిల్ ను ప్రకటించారు. ఈ సినిమా నుంచి క్రేజీ అప్డేట్ వచ్చింది. గురువారం అనుష్క శెట్టి పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ ను వదిలారు. ఇందులో రక్తంతో తడిసిన చేతితో అనుష్క సుట్టా పీలుస్తూ సీరియస్ గా చూస్తున్న పోస్టర్ అదిరిపోయింది. ఈ పోస్టర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.